## పోలీసువారి హెచ్చరిక విని ఎంతో జాగ్రత్తగా వుండి కూడా అతను ఎలా మోసపోయాడు?

**వడ్లమన్నాటి కుటుంబరావు కథ**

# ఇది పోలీసు వారి హెచ్చరిక!

ఇది పోలీసు వారి హెచ్చరిక!

బస్టాండ్‌లో దొంగలుంటారు. మీ జేబులు, సూట్‌కేసులు, వస్తువులు జాగ్రత్త.

ఆడ దొంగలుంటారు — నగలు నగైరాలు జాగ్రత్త. కొత్తవారిని నమ్మకండి. మోసానికీ... నష్టానికీ.... గురికాకండి! ఇది పోలీసు వారి హెచ్చరిక! హెచ్చరిక."

విజయవాడ బస్ స్టేషన్‌లోంచి... మైకులో ఒక గొంతు పదేపదే హెచ్చరిస్తోంది ప్రయాణికుల్ని.

"ఏమిటో ఈ పోలీసువాళ్ళ పిచ్చిగానీ... ఈ హెచ్చరికలవల్ల దొంగలు భయపడతారంటారా? ప్రయాణీకులు మోసపోకుండా ఉంటారంటారా? అసలు మన సామాజిక వ్యవస్థలో మౌలికమైన మార్పులు రావాలిగానీ... ఏమంటారు మాస్టారూ... మీరు?" అన్నాడాయన.

ఆ మాటలు నన్నుద్దేశించే అంటంవల్ల ఉలిక్కిపడి ఒక్కక్షణం ఆయన్ని పరికించిచూసి ఏమనాలో తెలియక ఔనన్నాను... కాజువల్‌గా.

ఆయన వయస్సు ఏభై ఏళ్ళు పైనే ఉంటుంది. ముడతలుపడ్డ ముఖం. నెత్తిన పేరుకు ఉన్నాయన్నట్టుగా కొత్తిమేర వెంట్రుకలు. సగం ముక్కుమీదకు జారిపోయిన కళ్ళజోడు. బీదతనాన్ని చాటిచెప్పే దుస్తులు... కిర్రు చెప్పులు!

ఆయన్ని చూడగానే నా మనసులో ఏదో గౌరవ భావం చోటుచేసుకుంది.

"మీరెందాకా వెళ్ళాలి మాస్టారూ?" అన్నాను. కేవలం సంభాషణ పొడిగించటానికి... బస్సు కోసం వెయిట్



కొట్టేసిందండీ?... ఇద్దరు డాక్టర్లు కలిసినా మేస్టారూ అని పిలుచుకోటమే... ఇద్దరు లాయర్లు కలిసినా మేస్టారూ అని పిలుచుకోటమే... ఇంతకీ ఏమన్నారు నేస్తున్న... బోరున పోగొట్టుకోటానికి."

"చూడండి మాస్టారూ! ఈ మాస్టారూ... అన్న పదం ఉంది చూశారూ. దీని సిగ్గొయ్య! ఎంత పబ్లిసిటీ మాస్టారూ... నేను ఎందాకా వెదుతున్నానని కదూ? భద్రాచలం అంటే!" అన్నాడాయన.

"చివరికి మీరుకూడా మాస్టారుని గట్టిగానే పట్టుకున్నారుగా మాస్టారూ!" అన్నాన్నేను నవ్వుతూ.

"భలేవారే మీరు 'మాస్టారూ'' అంటూ గలగలా నవ్వేశాడాయన.

'రండి! అలా కాంటీనుకెళ్ళి ఒక అర వేసుకుందాం'' అన్నాను.

నాలోని స్నేహప్రియత్వం ఆయనకి నచ్చింది కాబోలు "అలాగే పదండి"

అన్నాడాయన.

ఇద్దరం ఎవరి బ్రీఫ్‌కేసుని వాళ్ళు పుచ్చుకుని కాంటీను దాకా నడిచాం.

కాఫీ తాగుతుండగా అన్నాడాయన "ఇంతకీ మీరెందాకో చెప్పలేదు మాస్టారూ."

"నేను మంత్రాలయం వెళ్ళాలి మేస్టారూ" వద్దంటున్నా బలవంతంగా బిల్లు పేచేశాడాయన కౌంటర్లో.

ఇద్దరం మళ్ళీ బయటికి నడిచాము. "అరెరె మాస్టారూ ఒక్కక్షణం నా బ్రీఫ్‌కేసు చూస్తుండండి. చాలా పొరపాటు జరిగిపోయింది... అంటూ అంగలు పంగలు వేసుకుంటూ వెళ్ళిపోయాడాయన."

నేను అక్కడే... అలాగే... నిలబడ్డాను ఆశ్చర్యంతో... అయోమయంగా.

అయిదు నిమిషాలకి తిరిగి వచ్చేశాడాయన.

'అమ్మయ్య!' అనుకున్నాన్నేను.

ఈసారాయన ముఖం దివిటీలా వెలిగిపోతోంది.

"ఏమయింది మాస్టారూ?" అన్నాను ఆసక్తిగా.

"నాక్కాస్త మతిమరుపు ఎక్కువలెండి. రిక్షావాడిని ఇక్కడే ఉండు... వంద రూపాయల చిల్లర మార్చుకుని నీ బాడుగ డబ్బులిస్తాను అని చెప్పి వచ్చి... మీరొచ్చే ముందే వంద రూపాయల చిల్లర మార్చి... ఆ రిక్షావాడి మాటే మర్చిపోయాను. కౌంటర్లో బిల్లు చెల్లిస్తుంటే కాషియర్ దగ్గర చిల్లర చూసి ఛటుక్కున గుర్తువచ్చింది పాపం! అలా కాకపోతే వాడు ఇంటికి వెళ్ళి నన్ను నా కుటుంబ సభ్యుల్ని... ఎంత అసభ్యంగా తిట్టుకునే వాడో...?" అంటూ నొచ్చుకున్నాడు.

ఆయన సిన్సియారిటీకి సహృదయతకి హేట్సాఫ్! అనుకున్నాను మనసులో.

"వెల్‌డన్ మాస్టారు! అయితే మీకో చిన్న క్విజ్ లాంటిది వేస్తాను."

"ఏమిటండోయ్ మాస్టారూ అది?" నవ్వేస్తూ అన్నాడాయన.

"మీరా హడావుడిలో మీ బ్రీఫ్‌కేసు నా దగ్గర అలా వదిలేసి వెళ్ళిపోయారే...? నేనొకవేళ పోలీసు వారి హెచ్చరికలోని 'హీరో'నయి ఉంటే... ఈపాటికి మీ పని ఏమయివుండేది?"

ఆయన దాన్ని అతి తేలిగ్గా తీసుకున్నాడు. "జీవితంలో నేను ఎన్ని ఢక్కాముక్కీలు తిని ఉంటాను? మీరెలాంటివారో ఆమాత్రం ఊహించుకోలేకపోతే నా వయసు... అనుభవం ఎందుకు తగలబెట్టనా? ఆ కేటుగాళ్ల కేటగిరిలోకి మీరు నేను ఎందుకు వస్తాం మాస్టారూ? ఆ ఉడతలు పట్టే వాళ్ళు... దొంగకోళ్ళ మొహాలు... దొరికిపోతూనే ఉంటాయ్" అన్నాడు నిబ్బరంగా.

దాంతో నా ఛాతీ ఆరు సెంటీమీటర్లు పెరిగింది.

ఇద్దరి బస్సులకూ ఇంకా అరగంటపైనే టైముంది.

"అలా లాంజ్‌లోకెళ్ళి కూర్చుందామా? ఇప్పుడు ఎనిమిది గంటలేగా అయ్యింది..." అన్నాను.

"ఓ!" అన్నాడాయన.

ఇద్దరికీ రెండు రూపాయలు పేచేసి లాంజ్‌లో రెస్టు టికెట్లు — ఒక గంటకు — నేనే తీసుకున్నాను.

మిరుమిట్లు గొలిపే లైట్ల వెలుగులో ప్లాస్టిక్ కుర్చీలలో కూర్చున్నాం ఇద్దరం.

గ్యాస్ సిలెండర్ల స్కేర్సిటీ నుంచి... పెరిగిన బస్‌ఛార్జీల మీదుగా... ఆయుధాల కొనుగోలులో జరిగిన అవకతవకలు... వి.పి.సింగ్ రాజీనామా వరకూ కరువు తీరా చర్చించాను.

మిత్ర బృందం నన్ను "వీరసుత్తి" గాణ్ణని విరసిస్తూ ఉంటారు. సాధ్యమయినంత వరకూ నా వాక్ప్రవాహం బారిన పడకుండా తప్పించుకుంటారు.

ఈయన నిజంగా మహానీయుడని చెప్పుకోవాలి!

నేనెంత సుత్తికొట్టినా... నన్నేమాత్రం విసుక్కోకుండా సుతిమెత్తగా... సుతారంగా... ప్రోత్సహిస్తూనే ఉన్నాడు.

"మాస్టారూ! టైం దగ్గరపడుతున్నట్టుంది. నేను ఒకసారి బాత్‌రూంకెళ్ళి... వాష్ బేసిన్ దగ్గర ముఖం కడుక్కుని రిఫ్రెష్ అయి వస్తాను" అన్నాను లేస్తూ.

"అలాగే మాస్టారూ! ముందు మీరు వెళ్ళిరండి! మీ తరువాత నేను. ఆ తరవాత ఇద్దరం ఒకళ్ళ అడ్రసు ఒకళ్ళు తీసుకుని... విడిపోదాం. మన స్నేహబంధం ఇలాగే కొనసాగాలి సుమా!" అన్నాడాయన.


నేను సంతోషంగా తలపంకించి టాయిలెట్ వైపు నడిచాను.

నాలుగు నిముషాల్లో ఫ్రెష్‌గా తయారయి వచ్చాను.

నేనింతకు ముందు కూర్చున్న స్థానంలో ఆయన బ్రీఫ్‌కేస్ ఉంటం... నా బ్రీఫ్‌కేసు ప్లస్ ఆయన అదృశ్యమవటం చూసి నిర్ఘాంతపోయాను.

కౌంటర్ దగ్గరకెళ్ళి "ఇప్పటివరకూ నా పక్కన కూర్చున్న ఆయన ఏడీ?" అన్నాను కంగారుగా.

"చుట్ట తాగాలని ఒకటే కుతిగా



ఉందట. కాంటీను ముందు ఉంటాను మిమ్మల్ని రమ్మని చెప్పమన్నాడు సార్'' అన్నాడతను.

నేను అవాక్కయిపోయి... ఒక్క దాటు న ఆయన వదిలిపెట్టిన సూట్ కేసుని పట్టు కుని కాంటీను వేపుకి పరుగెట్టాను.

బుల్ షిట్!

అక్కడ ఆయన లేనే లేడు!!!

నాకు ముచ్చెమటలు పోశాయి.

ఆయన కోసం కాలుగాలిన పిల్లిలా విజయవాడ బస్ స్టేషనంతా కలియతిరిగాను.

ఆ బజారులో... ఒకరిద్దరు ఎదురుపడ్డవాళ్లని "మీకామాస్టారూ కనుపించారా?" అన్నాను.

"ఏ మేస్టారు?" అన్నాడొకతను వెక్కిరింతగా.

"మ్యాన్యులూజు కేసుగాబోలు!" అనుకుంటూ నవ్వుకున్నారు ఆ పక్కనే నిలబడి కబుర్లు చెప్పు కుంటున్న ఇద్దరమ్మాయిలు.

కోపాన్ని దిగమింగుకుని... వెతికి వెతికి వేసారి... పోలీసు వారు ఎనౌన్స్‌మెంటు ఇస్తున్న అపార్టుమెంట్‌కి వచ్చాను.

ఎదురుగుండా గుడిలో... వెలుగులో కనిపిస్తున్న వెంకటేశ్వరుడికి — ఆపద మొక్కుల వాడికి మనసులోనే నమస్కరించుకున్నాను... కాపాడమని.

నేచెప్పిందంతా విని ఆ కానిస్టేబుల్ అన్నాడు "మీరు చూడబోతే... చాలా తెలివిగలవారిలా కనిపిస్తున్నారు. ఆ కొత్త వ్య క్తిని ఎలా నమ్మారు సార్! అక్కడికీ నేను మైకులో గొంతు చించుకుంటూ అరుస్తూనే ఉన్నాను గదా!" పోయిన బ్రీఫ్‌కేసుపోగా అతని ముందు తల దించుకున్నాను... దోషిలా.

"ఎంత పోయుంటుంది?" జాలిగా అడిగాడతను మళ్ళీ.

"బట్టల విలువ పదిహేను వందలుంటుం ది. ఓ వెయ్యి కాష్ కూడా మడతల్లో పెట్టాను" అన్నాను నీరసంగా.

ఒక్క క్షణం ఆగి... "పోనీ... ఈ బ్రీఫ్‌కేసులో ఏమున్నయ్యో చూద్దామంటారా?" అన్నాను.

ఆ కానిస్టేబుల్ నవ్వే వెర్రివెంగళాయిగా జమకట్టి... బ్రీఫ్‌కేసుని బలంగా నేలకేసి కొట్టాను. రెండు భాగాలుగా విచ్చుకుపోయి తెరుచుకొందది.

దాన్నిండా కాటన్ వేస్టు! మధ్య మధ్యలో కంకరరాళ్లు!!

నాకు కళ్ల నీళ్ళ పర్యంతమయింది.

"అరె! ఈ కాగితం మడత ఏమిటి ఇందులో?" అంటూ తీసి... అందులో రాసినదాన్ని పైకి చదివాడు కానిస్టేబుల్.

"ఇది దొంగగారి హెచ్చరిక! పోలీసు వారు హెచ్చరికలు చేస్తూనే ఉంటారు. ప్రయాణీకులు మా వల్లో పడుతూనే ఉంటారు. కాకపోతే కొత్త వేషభాషలు మారుస్తూ ఉండాలి డ్యూాల్!

ఇట్లు
మాస్టారు కాని కేడీ మాస్టారు!

నన్ను నేను తిట్టుకుంటూ... తిరుగు ముఖం పట్టాను. అంతకన్నా ఏం చెయ్యగలను కనుక!!

*